సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 5 । మార్చి । 2023



శ్రీవారి సన్నిధిలో హైకోర్టు జడ్జి
భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని హైకోర్టు జడ్జి డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ సందర్శించారు.



నకిలీ ఫీడ్ ముఠా అరెస్ట్
కైకలూరు పరిసర ప్రాంతాల్లో నకిలీ మేత (ఫీడ్ సప్లిమెంటరీ) బస్తాలను ఆక్వా రైతులకు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో ▸

జీఐఎస్ అద్భుతం
విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) అద్భుతమని పారిశ్రామికవేత్త, రొయ్యల సాగులో జాతీయ అవార్డు గ్రహీత కేఆర్‌కే మూర్తి రాజు అన్నారు. -8లో

Global Investors Summit 2023

న్యూస్‌రీల్

శ్రీవారి క్షేత్రం కిటకిట



జంట గోపురాల వద్ద భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో నిండిపోయాయి. నిత్యాన్నదాన భవనం వద్ద అన్నప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆదివారం సైతం భక్తుల రద్దీ అధికంగా ఉండవచ్చని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

తేనెటీగల పెంపకంతో లాభాలు



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి: తేనెటీగల పెంపకంతో గ్రామీణ యువత లాభాలు పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు అన్నారు. ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞానకేంద్రం (కేవీకే)లో తేనెటీగల పెంపకంపై కో-ఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మార్టేరు వరివరిశోధనా కేంద్రం సహసంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తేనెకు డిమాండ్ బాగుందని, గ్రామీణ యువతకు వీటి పెంపకం వరమన్నారు. విజయరాయి వ్యవసాయ వరి పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ కె.మోహనరావు, నాబార్డు డీడీఎం టి.అనిల్‌కాంత్ మాట్లాడుతూ జాతీయ తేనెటీగల బోర్డు ద్వారా కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో సహాయ,సహకారాలు అందిస్తుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎ.రాజేష్, డెబోరా మెస్సీయానా, ఎ.శ్రీనివాసరావు, పి.వినయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌కు ఇన్నోవేషన్ సెంటర్ మంజూరు



మంజూరు పత్రాలను చూపిస్తున్న ఎస్‌ఆర్‌కేఆర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సాక్షి, భీమవరం: నీతి ఆయోగ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ (ఏసీఐసీ) మంజూరైందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు శనివారం తెలిపారు. ఈ సెంటర్ ద్వారా ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో వనరులతో పరిశ్రమలను ప్రోత్సహించడం, స్టార్టప్‌లను ఏర్పాటు చేయించడానికి వీలుంటుందన్నారు. కళాశాల యాజమాన్యం కూడా ప్రత్యేక ప్రయోగశాలలను ఏర్పాటుచేసి స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామన్నారు. వ్యవసాయం, ఆక్వా, ఉద్యాన పంటల సాగులో రైతులకు ఉపయోగపడే స్టార్టప్‌లను ప్రారంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇన్నోవేషన్ సెంటర్ సీఈఓగా వెట్ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నంద్యాల శివకిషన్ వ్యవహరిస్తారని చెప్పారు. కళాశాల ఆర్అండ్‌డీ పీఏ రామకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, ఎం.సురేష్‌బాబు పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల జోరు

- జిల్లాలో 80 శాతం మేరకు పూర్తి
- కార్యదర్శుల ప్రత్యేక శ్రద్ధ
- గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్
- బాధ్యతగా పన్ను చెల్లిస్తున్న ప్రజలు



వీరవాసరం మండలం నవుదూరులో పన్నులు వసూలు చేస్తున్న కార్యదర్శి

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి పన్ను, చెరువులు, షాపులు, లైసెన్స్ తదితర (నాన్‌ట్యాక్స్) పన్నుల వసూలు వేగంగా సాగుతోంది. గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా ఇంటి పన్ను వసూలు 80 శాతం, నాన్‌ట్యాక్స్ వసూలు 75 శాతం పూర్తిచేశారు. ఈనెల 15 నాటికి డెడ్‌లైన్‌గా పెట్టుకుని 95 శాతానికి పైగా పన్ను వసూలు చేయాలని ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు.

గ్రామీణ ప్రాంత ప్రజల్లో మార్పు
మూడేళ్లుగా జిల్లాలో దాదాపు 80 నుంచి 90 శాతం పన్నులు వసూలవుతున్నాయి. దీనిని బట్టి చూస్తే గ్రామీణ ప్రాంత ప్రజల్లో పన్ను చెల్లింపుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. పంచాయతీకి ఇంటి పన్ను చెల్లించడం బాధ్యతగా భావిస్తున్నారు. గతంలో ఇంటి పన్నుపై నిర్లక్ష్యం కనిపించడంతో పన్ను వసూళ్ల శాతం తక్కువగా ఉండేది. ప్రస్తుతం పరిస్థితి మారింది. సమయానికి, సక్రమంగా కట్టడంతో పన్ను వసూళ్ల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది.

గృహపన్ను వసూలు రూ.19.03 కోట్లు
జిల్లావ్యాప్తంగా ఇంటి పన్ను వసూళ్ల డిమాండ్ రూ.23,77,78,598 కాగా ఇప్పటివరకు రూ.19,03,36,398 వసూలు చేశారు. ఇంకా రూ.4,74,42,200 వసూలు చేయాల్సి ఉంది. అలాగే నాన్ ట్యాక్స్ డిమాండ్ రూ.18,39,88034 కాగా ఇప్పటివరకు రూ.13,78,36,884 వసూలు చేయగా.. రూ.4,61,51,146 వసూలు చేయాల్సి ఉంది.

జిల్లాలో మండలాలు	19
గ్రామ పంచాయతీలు	368
పన్ను వసూళ్ల డిమాండ్	రూ.42.17 కోట్లు
ఇప్పటివరకూ వసూలు	రూ.32.81 కోట్లు
వసూలు కావాల్సింది	రూ.9.36 కోట్లు

నూరుశాతం లక్ష్యంగా..



జిల్లాలో ఇంటి పన్ను, నాన్ ట్యాక్స్ వసూళ్లు వేగంగా సాగుతున్నాయి. గతేడాది సెప్టెంబర్ నుంచి పన్ను వసూళ్లు ప్రారంభించగా ఇప్పటివరకు దాదాపు 80 శాతం పూర్తిచేశాం. ఈనెల 15 నాటికి నూరు శాతం వసూలు లక్ష్యంగా చర్యలు తీసుకున్నాం. గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్నాం.
- ఎం.నాగలత, జిల్లా పంచాయతీ అధికారి

నేడు సీఎం జగన్ రాక

కలగంపూడిలో వివాహ వేడుకకు హాజరు



పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతి

యలమంచిలి: ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె డాక్టర్ సింధు వివాహ వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం సాయంత్రం 4 గంటలకు మండలంలోని కలగంపూడి గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రత్యేక ట్రయిల్ రన్ నిర్వహించారు. కాజ నరేంద్రస్వామి దేవస్థానం భూముల్లో హెలీప్యాడ్ ఏర్పాటుచేశారు. అక్కడ నుంచి సీఎం జగన్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన వివాహ వేదిక వద్దకు ప్రత్యేక వాహనంలో చేరుకుంటారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటన విజయవంతానికి అధికారులంతా కృషి చేయాలని, చిన్నపాటి పొరపాటుకు కూడా తావివ్వొద్దన్నారు. ఉదయం హెలికాప్టర్ ట్రయిల్‌రన్, సాయంత్రం వాహనాల ట్రయిల్ రన్ నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

పర్యటన సాగేదిలా..
- మధ్యాహ్నం 3.40 గంటలకు తాడేపల్లిలో ఇంటి నుంచి ముఖ్యమంత్రి బయలుదేరతారు.
- మధ్యాహ్నం 3.45 గంటలకు తాడేపల్లిలో హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- సాయంత్రం 4.20 గంటలకు హెలికాప్టర్‌లో కలగంపూడి వస్తారు.
- సాయంత్రం 4.20 నుంచి 4.30 వరకు ప్రజలతో మాట్లాడతారు.
- సాయంత్రం 4.35 గంటలకు వివాహ వేదికకు చేరుకుంటారు.
- 4.50 గంటల వరకు వివాహ వేదిక వద్ద ఉండి నూతన దంపతులను ఆశీర్వదిస్తారు.
- సాయంత్రం 4.55 గంటలకు తిరిగి కలగంపూడిలో హెలీప్యాడ్ ప్రాంతానికి చేరుకుంటారు.
- సాయంత్రం 5.10 గంటల వరకు అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- సాయంత్రం 5.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

ట్రాఫిక్ మళ్లింపు
ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దిగమర్రు-చించినాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను మళ్లించారు. పాలకొల్లు వైపు వెళ్లే వాహనాలను చించినాడ నుంచి మేడపాడు మీదుగా పాలకొల్లు చేరేలా, నరసాపురం వైపు వెళ్లే వాహనాలను చించినాడ, ఏనుగువానిలంక, సరిపల్లి మీదుగా నరసాపురం చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



పరుగు పోటీలు

సాక్షి, భీమవరం: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధశాఖల ఉద్యోగినులకు శనివారం స్థానిక డీఎన్నార్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈనెల 6వ జిల్లా స్థాయిలో జరిగే లెమెన్ అండ్ స్పూన్, టెన్నికాయిట్, కిలోమీటరు నడక, 50 మీటర్ల పరుగు, బ్యాడ్మింటన్ విభాగాల్లో సెలెక్షన్స్ నిర్వహించినట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ పి.సురేంద్రబాబు చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలకు ఈనెల 8న భీమవరం విష్ణు కళాశాలలో నిర్వహించే ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందిస్తామన్నారు.

430 మంది ఎమ్మెల్సీ ఓటర్లు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 430 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా రెవెన్యూ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.కృష్ణవేణి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఎన్నికల నిర్వహణపై ఆమె సమీక్షించారు. భీమవరం ఎంపీడీఓ కార్యాలయంలో 201 మంది, నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో 229 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌పై వివరించారు. మోడల్ అధికారులు కమిటీల విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. అడిషనల్ ఎస్పీ ఏపీ సుబ్బరాజు మాట్లాడుతూ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు లాంఛనం

మంత్రి కారుమూరి, ఎంపీ బోస్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి, చిత్రంలో ఎంపీ బోస్, ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్రీనివాస్, రవీంద్రనాథ్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు లాంఛనమే అని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. భీమవరం యూత్‌క్లబ్‌లో శనివారం జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కారుమూరి, బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం జెడ్పీ వైస్ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించారన్నారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో సహృదయంతో ఏకగ్రీవం చేసుకున్నామని, అయితే ఇప్పుడు తెలుగుదేశం నాయకులు మాట ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. వారు ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండు ప్రాధాన్యతా ఓట్లను వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వేయాలని కోరారు. నేడు ప్రపంచం అంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోందని, లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయన్నారు. విశాఖలో జరిగిన సమ్మిట్‌కు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరుకావడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు గోకరాజు రామరాజు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ మాట్లాడారు. కాళ్ల, ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల జెడ్పీటీసీలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రణస్థుల కనకదుర్గ, వేగేశ్న వెంకటరాజు, ఎంపీపీలు పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, ఇందుకూరి శ్రీహరి నారాయణ రాజు, కటారి జయలక్ష్మి కేశవ, భూపతిరాజు చంటిరాజు, ఆకివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రక్తహీనత నివారించాలి



పి.ప్రశాంతి, కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): గర్భిణుల్లో రక్తహీనత తలెత్తకుండా పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల మరణాలకు రక్తహీనత ప్రధాన అంశంగా మారిందన్నారు. రక్తహీనత అనర్థాలపై పూర్తి అవగాహన కల్పించాలని, మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని సూచించారు. మొదట కాన్పులో రక్తహీనతకు గురైనవారికి రెండో కాన్పులో కూడా అదే సమస్య తలెత్తడం సరికాదన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం పొందిన వారి నుంచి వైద్య సహాయంపై వివరాలను తెలుసుకుని నివేదిక సమర్పించాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధ తదితరులు పాల్గొన్నారు.

ఫైన్లకు స్వస్తి.. అవగాహన జాస్తి

- హెల్మెట్ వాడకం, లైసెన్సులపై ప్రత్యేక డ్రైవ్
- వాహనచోదకులతో హెల్మెట్ కొనుగోలు చేయిస్తున్న పోలీసులు
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం



భీమవరంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సాక్షి, భీమవరం: పోలీసులంటే కఠినంగా ఉంటారనే ప్రచారానికి తెరదించుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో జిల్లా పోలీసుశాఖ ముందుకు సాగుతోంది. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్స్ వాడకం, డ్రైవింగ్ లైసెన్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఎస్పీ యు.రవిప్రకాష్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది రోజూ ఉదయం, సాయంత్రం డ్రైవ్ నిర్వహిస్తూ హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించడంతో పాటు వాహనదారులతో అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేయిస్తున్నారు.

ప్రాణనష్టాన్ని తగ్గించేలా..
రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల నెలకు సుమారు 26 మంది చనిపోతున్నట్టు పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడానికి హెల్మెట్ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు. గతంలో మాదిరిగా హెల్మెట్ లేకుంటే ఫైన్ వేయకుండా అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజూ తప్పనిసరిగా ఒక్కో సెంటర్‌లో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. హెల్మెట్ లేని వాహనదారులను నిలిపి వాహనాన్ని స్వాధీనం చేసుకుని హెల్మెట్‌తో వస్తే తిరిగి వాహనం ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఇలా జిల్లాలో సుమారు 28 స్టేషన్ల పరిధిలో రోజుకు సుమారు 100 మందికిపైగా వాహనదారులతో హెల్మెట్లు కొనిపిస్తున్నారు. దీంతో జిల్లాలో హెల్మెట్ వాడకం కూడా పెరిగింది.

ఎల్ఎల్ఆర్‌లపై..
డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్కడికక్కడే ఎల్ఎల్ఆర్ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులకు కూడా ఫైన్ వేయకుండా ఎల్ఎల్ఆర్ తెచ్చుకుంటే వాహనాలను తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత నిర్ణీత గడువులోపు శాశ్వత లైసెన్సు తీసుకునేలా ఏర్పాట్లుచేశారు.

నెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్



రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ వాడకం లేకపోవడం వల్ల ఎక్కువ మరణాలు చోటుచేసుకుంటున్నట్టు గుర్తించాం. వాహనదారుల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన పెంచడానికి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుంటే ఫైన్ వేసే పద్ధతికి స్వస్తి చెప్పి అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నాం. దీంతో హెల్మెట్ వాడకం పెరిగింది. నెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. వాహనదారులు, ప్రజలు సహకరించాలి.
- యు.రవిప్రకాష్, ఎస్పీ, భీమవరం

పరిశ్రమల ప్రోత్సాహకానికి నిట్ కృషి


సమ్మిట్లో విషయాలు వివరిస్తున్న నిట్ ఆచార్యులు

తాడేపల్లిగూడెం: కామన్ రీసెర్చ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ హబ్ ప్రాజెక్టు ద్వారా పునరుత్పాదక ఇంధన శక్తి వనరుల రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను ప్రోత్సహించడానికి నిట్ విద్యా సంస్థ చేస్తున్న కృషిని విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టమ్ సమ్మిట్‌లో నిట్ ఆచార్యులు వివరించారు. ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన డాక్టర్ పెద్దపాటి శంకర్, కర్రి శ్రీఫణికృష్ణ పాల్గొన్నారు. నిట్‌లో రూ.7.15 కోట్లతో చేపట్టిన కామన్ రీసెర్చ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ హబ్ ప్రాజెక్టుపై వివరించారు. ఇలాంటి హబ్ దేశంలో మొదటిది కాగా, నిట్‌లలో మొదటిదన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రానున్న నాలుగేళ్ల కాలంలో చేపట్టనున్న లక్ష్యాలను, ప్రణాళికలను సమ్మిట్ నిర్వాహకులకు తెలియజేశారు. సమ్మిట్‌కు హాజరైన వివిధ కంపెనీల ప్రతినిధులతో పలు పరిశోధనలపై చర్చించినట్టు ఆచార్యులు శనివారం స్థానిక విలేకరులకు చెప్పారు. ఆచార్యులను నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రమోద్‌పడోలే, రిజిస్ట్రార్ దినేశ్ పి.శంకరరెడ్డి తదితరులు అభినందించారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ అద్భుతం

- రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం
- కార్పొరేట్ కంపెనీల ప్రతినిధుల రాకతో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం
- ఆకివీడు పారిశ్రామికవేత్త కేఆర్కే మూర్తిరాజు వెల్లడి


సమ్మిట్‌లో పాల్గొన్న ఆకివీడు పారిశ్రామికవేత్త, రొయ్యల పెంపకంలో జాతీయ అవార్డు గ్రహీత కేఆర్కే మూర్తిరాజు

ఆకివీడు: రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్టణంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ దేశంలోనే చరిత్రాత్మకమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సదస్సు అద్భుతమని స్థానిక పారిశ్రామికవేత్త, రొయ్యల సాగులో జాతీయ అవార్డు గ్రహీత కేఆర్‌కే మూర్తి రాజు అన్నారు. సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన ఆయన శనివారం ‘సాక్షి’తో మాట్లాడుతూ అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు ఇచ్చిన హామీలు తు.చ.తప్పకుండా అమలు అవుతాయని గట్టి నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు కచ్చితంగా వస్తాయని సదస్సు చూసిన వారు నమ్మి తీరుతారన్నారు. రాష్ట్రంలోని తీర ప్రాంతాలు, విమాన సౌకర్యం, రహదారులు, వనరులు ఉన్న ప్రాంతాలు పారిశ్రామిక వేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్పొరేట్ రంగంతో పాటు, ప్రభుత్వ రంగంలోని పలు సంస్థలు కూడా ముందుకు వచ్చి పరిశ్రమల స్థాపనకు హామీలివ్వడంతో రాష్ట్రం పారిశ్రామికంగా ప్రగతి సాధిస్తుందని చెప్పారు. అదానీ, అంబానీ, దాల్మియా, బంజాకా వంటి పేరొందిన ఎన్నో కార్పొరేట్ దిగ్గజాలు వైజాగ్‌లో అడుగుపెట్టడం పరిశ్రమల ఏర్పాటుకు ఆరంభ సూచికమన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రగతిపథంలో పయనిస్తుందని మూర్తి రాజు చెప్పారు. అరటి, కొబ్బరి, వరి, ఆక్వా, చేపల ఉత్పత్తి వంటి పంటలు దేశంలోనే మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్ని అనుసంధానం చేస్తూ పరిశ్రమల స్థాపన జరగాలన్నారు. పరిశ్రమల విస్తరణ పల్లెలకు చేరాలని ఆయన సూచించారు. ప్రభుత్వం గ్రామీణ నైపుణ్యం పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. హైజనిక్ ఉత్పత్తులకు స్థానం కల్పించాలని సూచించారు. పారిశ్రామికంగా ఉప ఉత్పత్తుల్ని, విడి భాగాల్ని గ్రామీణ ప్రాంతాలకు చేరే విధంగా కృషి చేయాలని మూర్తి రాజు కోరారు. పరిశ్రమల కేంద్రీకృతంతో తక్కువ ధరలకు ప్రజలకు వస్తువులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. విద్యా వంతులైన యువకులకు ఉపాధి అవకాశాలు మెండుగా కలుగుతాయన్నారు. గ్లోబల్ సమ్మిట్‌ను రాజకీయం చేయకుండా ప్రతిపక్షాలు కూడా సహకరిస్తే రాష్ట్రం పారిశ్రామికంగా కూడా ప్రగతిపథంలో పయనించి దేశంలోనే అగ్ర రాష్ట్రంగా నిలబడుతుందని మూర్తిరాజు ఆకాంక్షించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయంలో జరిగిన పారిశ్రామిక సదస్సు విజయవంతంగా జరగలేదని చెప్పారు. తదనంతరం కూడా పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు రాలేదన్నారు. రాష్ట్రంలో అపారమైన వనరుల్ని సద్వినియోగ పరచుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన సమ్మిట్ ప్రతిష్టాత్మకమైనదిగా భావించాలని సూచించారు.

నేడు ఏలూరులో ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

సాక్షి, భీమవరం: కాకినాడ లేడీస్ క్లబ్‌లోని ద్రోణ అకాడమీలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ ఫెన్సింగ్ జట్టు ఎంపికను ఆదివారం ఏలూరులో నిర్వహిస్తున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ చెప్పారు. ఏలూరులోని కస్తూరిబా మున్సిపల్ పాఠశాలలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి సెలెక్షన్స్ ఫెన్సింగ్ కోచ్ ఎస్‌కేహెచ్ రామ్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనే ఫెన్సింగ్ క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 63042 52121, 83330 32217 సెల్ నంబర్లలో సంప్రదించాలని కృష్ణమోహన్ కోరారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షకు 8,748 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రయోగ పరీక్షల్లో శనివారం 8,748 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో జరిగిన పరీక్షకు 87 కేంద్రాల్లో 7,154 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6,999 మంది హాజరు కాగా, 155 మంది గైర్హాజరయ్యారు. అలాగే 28 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 1,931 మంది హాజరు కావాల్సి ఉండగా 1,749 మంది హాజరు కాగా, 182 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే చంద్రశేఖరబాబు చెప్పారు.

గడపగడపకు సంక్షేమం


పెనుగొండ : సిద్ధాంతం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఆక్వా నకిలీ ఫీడ్ విక్రయ ముఠా అరెస్టు


పట్టుబడిన ముఠాను చూపుతున్న సీఐ వైవీవీఎల్.నాయుడు, ఎస్ఐ మణికుమార్

కైకలూరు (కలిదిండి): ఆక్వా రంగాన్ని నకిలీల బెడద వదలడం లేదు. ప్రముఖ కంపెనీలను పోలిన నకిలీ మేత (ఫీడ్ సప్లిమెంటరీ) బస్తాలను ఆక్వా రైతులకు అంటగడుతూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువంటి మోసాన్ని కలిదిండి పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను కైకలూరు సర్కిల్ సీఐ వైవీవీఎల్.నాయుడు, కలిదిండి ఎస్ఐ మణికుమార్‌లు కలిదిండి పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరులకు వివరించారు. విశాఖపట్నంలో సీ బాస్ బయో రెమిడీస్ కంపెనీ ఫినామిన్ ఆక్వా మినరల్స్ మేతలను రొయ్యల రైతులకు డీలర్ల ద్వారా సరఫరా చేస్తోంది. కైకలూరు పరిసర ప్రాంతాల్లో ఈ కంపెనీ మేతను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన సయ్యపురెడ్డి మునీంద్ర, గుంటూరు జిల్లా, సీతానగరానికి చెందిన చిట్టిప్రోలు వెంకట కోటేశ్వరరావుతో అచ్చుగుద్దినట్లు ఉండే సీ బాస్ బయో రెమిడీస్ సంచులను తయారు చేయించాడు. అక్కడ నుంచి పల్నాడు జిల్లా గామాలపాడుకు చెందిన మంచి శ్రీనివాసరావు ఈ సంచులలో సున్నం నింపి భీమవరంలో మునీంద్ర గోడౌన్‌లో నిల్వ చేయించాడు. కోరుకొల్లు గ్రామానికి చెందిన కేశిరెడ్డి వెంకట బలరామకృష్ణ సమీప రైతులకు వీటిని విక్రయిస్తాడు. వీటి సరఫరా బాధ్యతలను పల్నాడు జిల్లా నడికుడి, దాచేపల్లి గ్రామాలకు చెందిన వ్యాన్ యజమాని షేక్ అబ్బర్ అలీ, డ్రైవర్ షేక్ మహమ్మద్ చూస్తారు. ఇలా సాగుతుండగా ఫిబ్రవరి 6న ముదినేపల్లి మండలం ఈడేపల్లి గ్రామానికి చెందిన సీ బాస్ బయో రెమిడీస్ కంపెనీ రికవరీ మేనేజర్ బండి ఫణికుమార్ నకిలీ మేతల విక్రయాలపై కలిదిండి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐదుగురు సభ్యుల నకిలీ రాకెట్ ముఠా పోలీసులకు చిక్కింది. కేసు నమోదు చేసి వాహనాలు, మేతలను సీజ్ చేశారు.

ఏప్రిల్ 7 నుంచి నాటిక పోటీలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో పట్టణంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణవర్మ శనివారం చెప్పారు. పోటీలకు ఏడు నాటికలు ఎంపిక చేశామన్నారు. 7న కొత్త పరిమళం, నాన్నా నేనొచ్చేస్తా, 8న ప్రక్షాళన, కెరటాలు, మృత్యువత్రం, 9న వెండి అంచులు, అతీతం నాటికలు ప్రదర్శించనున్నట్లు వివరించారు. మానాపురం సత్యనారాయణ, మేడికొండ శ్రీనివాస చౌదరి, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, కేఎస్‌పీఎస్ వర్మ, పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు


విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామివారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి తెల్లవారు జామున సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేసారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గ్రామాల్లో బాల్య వివాహాలు జరకుండా ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె కుమారి చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిషేదంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివాహ వయస్సు 18 సంవత్సరాలు పూర్తి కాని బాలికలకు పెళ్లి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, కిషోరి బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు ఉచిత దంత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.రమేష్ తెలిపారు. శనివారం తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పాఠశాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, దంత శుభ్రత, గురించి వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణు దంత కళాశాల వైద్యులు డాక్టర్ సురేఖ, దీపిక, లక్ష్మి, జియాఉల్ హాక్, హిమబిందు, స్రవంతి, కావ్య, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు


తణుకులో డ్రగ్స్ నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశం

తణుకు: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తణుకు ఎస్సై టి.వెంకటేశ్వరరావు తెలిపారు. మత్తు పదార్థాల పట్ల యువత ఆకర్షితులై భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. తణుకులోని స్థానిక ఈశ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన డ్రగ్స్ నియంత్రణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌తో కమిటీను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో ఎస్సై మాట్లాడుతూ గంజాయి ఇతర మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగంపై సమాచారం ఉంటే 94409 02436, 63016 72663 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

పెంటపాడువాసికి గుంటూరులో పింఛన్ అందజేత


గుంటూరు వెళ్లి రెడ్డి అప్పారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ పుష్పలత

పెంటపాడు: మండలంలోని మూడోవార్డుకు చెందిన రెడ్డి వెంకట అప్పారావు అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్నాడు. ఆయనకు పింఛన్ అందజేసేందుకు పెంటపాడు నుంచి వలంటీర్ సీహెచ్ పుష్పలత, గృహసారథి సీహెచ్ కిషోర్‌కుమార్‌లు శనివారం గుంటూరు వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉప సర్పంచ్ కొప్పూరి ప్రసాద్ రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వర్మ తన సిబ్బందితో శనివారం దాడులు చేసి గూడాల బాబులును అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఇన్‌స్పెక్టర్ వర్మ తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా...

- పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు
- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు

పెంటపాడు: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. గతంలో 11 పరీక్షా పేపర్లు ఉండగా ప్రస్తుతం ఈ ఏడాది నుంచి ఏడు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపరు కాలవ్యవధి 3.15 గంటలు. ఒక్కో పేపర్ వంద మార్కులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో పదోతరగతి విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. దీనిలో భాగంగా పాఠశాల వేళతో పాటు, అధనంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేదాది, అంతకుమందు ఏడాది కూడా కరోనా ప్రభావం వల్ల ఫలితాలు అంతంత మాత్రంగా వచ్చాయి. ఈ ఏడాది బడులు ఆలస్యంగా తెరిచినా విద్యాసంవత్సరం మాత్రం సక్రమంగానే సాగింది. అన్ని సబ్జెక్టులు విద్యార్థులు తెలుసుకోగలిగారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలతో పాటు, టౌన్ పరిధిలోని జిల్లా పరిషత్, ఎయిడెడ్, ప్రేవేటు, ఉన్నత, మున్సిపల్ పాఠశాలలకు సంబంధించి ప్రభుత్వ, ప్రేవేటు విద్యాసంస్థలకు సంబంధించి 3742 మంది పదోతరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పెంటపాడు మండలంలో విద్యాశాఖ 60 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక కార్యాచరణను హైస్కూల్లో అమలు చేస్తున్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు చేపడుతున్నారు. విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా మంచి మార్కులు సాధించేలా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.


దర్శిపర్రు జెడ్పీ స్కూల్లో ప్రత్యేక తరగతులలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు శాలిని

గణితంపై భయాన్ని తొలగిస్తున్నాం


గణితంపై ఉన్న అపోహలను భయాలను తొలగించి చాలా సులువైన సబ్జెక్టు అనే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నాం. వేగం, కచ్చితత్వం తెలుసుకొని సరిచూసుకుంటూ పరీక్షలు రాయాలి. విద్యార్థులు అదనపు తరగతుల ద్వారా బాగా అభ్యసనం చేయాలి. అప్పుడే అనుకొన్న సమయానికి కంటే ముందుగానే పేపరు పూర్తి చేయవచ్చు.

– మాథ్స్ ఉపాధ్యాయురాలు, టి. మహితా శాలిని, దర్శిపర్రు

విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ


సమ్మెటివ్ పరీక్షలు పూర్తికావడంతో చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్రధానంగా సాక్షి దినపత్రికలలో విద్య విభాగం ఎంతో ఉపయోగపడుతోంది. వాటిని విద్యార్థులతో చేయిస్తున్నాం. ఒత్తిడిలో విద్యార్థులు పొరపాట్లు చేయకుండా పరీక్షల్లో సులువుగా మంచి మార్కులు సాధించేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు బోదిస్తున్నాం.

– గణిత ఉపాధ్యాయులు, డీవీ రామకృష్ణ, దర్శిపర్రు

ప్రత్యేక క్లాసులు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి


పాఠశాలలో స్టడీ అవర్ పెట్టడం ద్వారా సబ్జెక్‌లో ఉన్న లోపాలు తెలుసుకొని పూర్తిగా అవగాహన పొందుతున్నాను. మా అందరికి ఈ ప్రత్యేక క్లాసులు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. ఉపాధ్యాయులు కూడా ఎంతో ఓపిగ్గా చెబుతున్నారు.

–ఇ. గౌరి, పెంటపాడు ప్రభుత్వ బీసీస్కూలు పదో వతరగతి

40 రోజుల యాక్షన్ ప్లాన్ ఎంతో బాగుంది


ప్రభుత్వం ప్రవేశపెట్టిన 40 రోజుల యాక్షన్‌ప్లాన్ ఎంతో ఉపయోగంగా ఉంటోంది. వెనుకబడిన విద్యార్థులకు కూడా మంచి మార్కులు వస్తాయి. ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– ఎం. లక్ష్మి లావణ్య, పెంటపాడు పదోతరగతి విద్యార్థిని

మంత్రి పరామర్శ


కొమ్మరలో గుడిమెట్ల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: కొమ్మర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పీఎంపీ వైద్యుడు గుడిమెట్ల రామకృష్ణారెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం పట్ల రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామకృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంకట అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నేడు గీతా మందిరంలో రంగస్థల కళాకారుల సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం ఈ నెల 5వ తేదీన ఆదివారం సాయంత్రం తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న గీతా మందిరంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో సంగీత విభావరి, కళాకారులకు సత్కారాలు, ఆర్థిక సహకారం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాకారులు, నియోజకవర్గ ప్రముఖులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవాలి

డీఈవో వెంకటరమణ


ముదునూరు జెడ్పీ స్కూల్లో పదోతరగతి విద్యార్థుల సామర్థ్యం తెలుసుకొంటున్న డీఈవో

పెంటపాడు: విద్యార్థులు విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచుకొని పదోతరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం ఆయన పెంటపాడు మండలంలోని ముదునూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, స్థానికంగా ఉన్న మరో నెంబర్-1 ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో నాలెడ్జ్ పెంచుకోవాలన్నారు. ఇంగ్లీషు బాషా పరిజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంగ్లీషు సబ్జెక్టుపై నిష్ణాతులు కావాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ట్యాబ్‌లను ఆయన పరిశీలించారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. వేల కోట్లు ఖర్చుపెట్టి ప్రభుత్వం విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల ద్వారా బైజ్యూస్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రత్యేకంగా లెక్కలు, ఇంగ్లీషుపై పట్టు సాధించాలన్నారు. వర్క్ బుక్స్ పరిశీలించారు. జగనన్న విద్యాకానుక, గోరుముద్ద తదితర రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసారు. ప్రతి నిత్యం రెండు గంటలు బైజూస్‌పై అవగాహన పెంపొందించుకొనేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. పదోతరగతి విద్యార్థుల ఉన్నత చదువు కోసం ఉపాధ్యాయులు వారికి ఉన్న సెలవులు వినియోగించకోకుండా విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం. శ్రీనివాస్, ఆయా పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి


మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగ మల్లేశ్వరీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వాలు మహిళలకు అనుకూలంగా ఎన్నో చట్టాలు తీసుకువచ్చారని, వాటిని ఆపదలో ఉన్న సమయంలో ఉపయోగించుకోవడం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగ మల్లేశ్వరీ, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అరుంధతిలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నియోజకవర్గ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లకు, మహిళా పోలీసులకు శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ గత చట్టాలకు, నేటి చట్టాలకు అనేక మార్పులు వచ్చాయని, ఓటు హక్కు, ఆస్తి హక్కు, గృహహింస, లింగనిర్ధారణ నేరాల చట్టం, తల్లిపాలు హక్కు చట్టం, తదితర చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లీలాకృష్ణ, రామకృష్ణ, ఇజ్రాయేల్ రాజు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు టి.వేణి, ఎస్తేర్‌రాణి, కె.శ్రీదేవి, ఎం.సుజాత, సీహెచ్‌కే దుర్గాభావాని, సీహెచ్ దుర్గాభవాని, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన


ముళ్లమ్మ అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: రావిపాడు శివారు బెండల్లంకలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న ముళ్లమ్మ అమ్మవారి మహోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు బెండల్లంక తూము వద్ద ఉన్న అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు చలిమిడి, పానకాలతో మొక్కులు తీర్చుకొన్నారు. ముగింపు పురస్కరించుకొని సుమారు 8 వేల మంది భక్తులకు భారీ అన్నసమారాధన చేసారు. ధర్మకర్తలు బొప్పెల తాతారావు సోదరులు దంపతుల సహకారంతో ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు, భక్తుల విరాళాలతో అమ్మవారికి 2 కేజీల వెండితో చేయించిన మూలవిరాట్ తొడుగును అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, కొండేపాడు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు కట్టా దానయ్య, దేవరశెట్టి సత్యనారాయణ, రావిపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు దాట్ల రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

మండపాకలో వైభవంగా కేశవ స్వామి రథోత్సవం


మండపాకలో కేశవ స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో వేంచేసియున్న శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ కేశవ స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సబ్బరపు సుజితాదేవి, సబ్బరపు రామారావు, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, ముద్దాల రవికాంత్, భక్తులు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత


విశాఖపట్టణంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో మహిళకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామానికి చెందిన పిల్లి జ్యోతి విశాఖపట్నంలోని మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ పవన్‌కుమార్ శనివారం విశాఖపట్నం ఆసుపత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ, ఉప సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి డా.బాబు తదితరులు పవన్‌కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు.

బంగారుగూడెంలో శ్మశాన భూమి ఆక్రమణ

- 10 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం
- శ్మశాన భూమి చుట్టూ సర్వే రాళ్లు


బంగారుగూడెం గ్రామంలో శ్మశాన భూమిసర్వే చేస్తున్న సచివాలయ సర్వే సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్ : ఆక్రమణలకు కాదేది అనర్హం అన్నట్టుగా తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం గ్రామంలో శ్మశాన భూమి ఆక్రమణకు గురైంది. గ్రామానికి 2.68 ఎకరాలు శ్మశాన భూమిని కేటాయించారు. దీనిలో ప్రస్తుతం 80 సెంట్లకు శ్మశానం కుచించుకుపోయింది. మిగిలిన భూమి సరిహద్దు రైతులు ఆక్రమించి పంట సాగు చేసుకుంటున్నారు. ఈ సమస్యపై గత 10 ఏళ్లుగా అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ విషయాన్ని గ్రామస్తులు సచివాలయానికి దరఖాస్తు చేసుకోవడంతో శనివారం సర్వే సిబ్బంది శ్మశాన భూమిని సర్వే చేసి, హద్దులను నిర్ణయించారు. ఆ వెనువెంటనే సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు 10 ఏళ్లుగా ఉన్న శ్మశాన భూమి ఆక్రమణ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది.

సోమేశ్వరుని ఆలయం వద్ద అన్నసమారాధన


సోమేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక గంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శనివారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పిండివంటలతో తొలుత స్వామివారికి నైవేద్యం సమర్పించి, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం చైర్మన్ గనిశెట్టి షణ్ముఖేశ్వరరావు, ఆలయ ఈవో కూచంపూడి శ్రీనివాసరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకివీడులో..

ఆకివీడు: వేద పండితుల పారాయణతో నిత్యం వెలుగొందే అతి పురాతన దేవాలయం స్థానిక భీమేశ్వరస్వామి ఆలయమని తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్ చెప్పారు. మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవం ముగింపు సందర్భంగా శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు ఎంతో నమ్మిక కలిగిన దేవాలయం అని చెప్పారు. అఖండ అన్నసమారాధనలో పెద్దింటి అమ్మవారి దేవస్థానం చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి, డైరెక్టర్ కుంకట్ల దానయ్య, మాజీ ఎంపీటీసీ మోరా జ్యోతి, కల్యాణోత్సవ కమిటీ చైర్మన్ గుర్రం శ్రీహరి, ఆలయ మాజీ చైర్మన్ సన్నిధి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని ధర్నా


భీమవరంలో గ్యాస్‌ధర పెంపునకు నిరసనగా ధర్నా చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలు పెంపు ప్రజలపై మోయలేని భారమని తక్షణమే పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి డిమాండ్ చేశారు. వంటగ్యాస్ ధర పెంపును నిరసిస్తూ శనివారం గునుపూడిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పకుమారి మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే వంటగ్యాస్ ధరలు తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ అధికారంలోకి వచ్చేక విపరీతంగా ధరలు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, ఇప్పుడు ప్రజలపై గ్యాస్ ధరల పెంపు గోరుచుట్టుపై రోకలి పోటులా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు సావారపు దేవి, పిండి సత్యవతి, వనువులేటి దానమ్మ, వలవల అరుణ కుమారి, దళిక రామలక్ష్మి, మేకా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలి

పాలకోడేరు: ప్రతి ఒక్కరికి వైద్యం అందే విధంగా చూడడంతో పాటు, చిన్నపిల్లలకు రోగ నిరోధక టీకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జిల్లా వైద్యాధికారి (డీఎంఅండ్‌హెచ్ఓ) మహేశ్వరరావు అన్నారు. పెన్నాడ గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంతో పాటు అదే గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డీఎంఅండ్‌హెచ్ఓ శనివారం పరిశీలించారు. ఎఫ్‌పీసీ కార్యక్రమాన్ని సమయపాలన పాటిస్తూ గ్రామంలో ఉన్న రోగికి వైద్యం చేరేలా చూడాలన్నారు. బెడ్ పేషెంట్‌ను, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందిన రోగులను, పాఠశాల విద్యార్థులను దగ్గరికి వెళ్లి పరీక్షించాలన్నారు. అదేవిధంగా యూపీ క్యాంపును ఎండలు విజృంభిస్తున్నందున ఉదయమే చిన్నపిల్లలకు వ్యాక్సిన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గడ్డి వాము దగ్ధం

సాక్షి, భీమవరం: గునుపూడి గరువుపేటలోని రూ.10 వేలు విలువైన గడ్డి దగ్ధమైందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పూర్తిగా కాలిపోయిందన్నారు. అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో మంటలను అదుపు చేశామన్నారు.